


"అమ్మా"! గుమ్మంలో నిలబడి నెమ్మదిగా పిలిచాడు విశ్వం.

"ఏమిట్రా"! బియ్యం ఏరుతున్న పార్వతమ్మగారు అడిగారు, తలెత్తి చూస్తూ.

"ఆ ఏమీలేదు మరి... మరి..."

"ఏమిటో తొందరగా చెప్పరా నాన్నక. అవతల నాకు పనుంది" విసుక్కున్నారు పార్వతమ్మగారు.

"అదేనమ్మా మొన్న నాన్నగారిని డాక్టరుగారి దగ్గరికి టెస్టులవీ చేయించాను గదమ్మా ఒంట్లో బావుండక పోతే... ఆ రిపోర్ట్సు ఇవాళ వచ్చాయి డాక్టరు గారు అవి ఇస్తూ"మీ నాన్నగారికి లంగ్ కాన్సర్ వచ్చే లక్షణాలున్నాయి. సిగరెట్లు అవీ పూర్తిగా మానెయ్యాలి. లేక పోతే ప్రమాదం' అని హెచ్చరించారు. నేను చెప్తే ఆయన బాధ పడతారు. నువ్వు చెప్పమ్మా నాన్నగారికి, సిగరెట్లు మానెయ్యమని" గబాగబా చెప్పి ఊపిరి పీల్చుకున్నాడు విశ్వం.

"ఆ!లంగ్ కేన్సరా!" వేతలుడిగినట్లు కూలబడి పోయారు పార్వతమ్మగారు.

"ఏంఫర్వాలేదు లేమ్మా, ప్రారంభంలోనే వుందిట, మందులకి తగ్గుతుంది. కాని సిగరెట్లు మాత్రం మానాలి అని అన్నారు డాక్టరు గారు నువ్వేం కంగారు పడకు" అని ధైర్యం చెప్పాడు విశ్వం తల్లికి.

"హూ!కంగారుపడక నేను చేసేదేముంది లేరా విశ్వం. నేను చెప్తే వింటారా మీ నాన్నగారు. 'పదిసార్లు చెప్పకు! నాకు తెలీదా ఏమిటి! చిన్న పిల్లలకు చెప్పినట్లు చెప్తావ్' అని విసుక్కుంటారు. ఈ మధ్య రిటైరయ్యిం దగ్గర్నుంచి మరీ విసుగు, కోపం ఎక్కువయ్యాయి. అన్నట్లు ఒరే విశ్వం మొన్న కోడలు సుజాత అందినాతో-అప్పుడప్పుడు నువ్వు కూడా సిగరెట్లు కాలుస్తున్నట్లున్నావని - ఒకటి రెండు సార్లు జేబులో సిగరెట్ పాకెట్టు చూశానని అంది. నిజమేన్రా! అయినా నాకు తెలియక అడుగుతాను ఆ వెధవ సిగరెట్లు తాగితే ఏమిట్రా ఆనందం, ఒళ్ళు పాడు చేసుకో టానికి కాకపోతే. మీ నాన్నగారి తోనే బాధపడుతుంటే నువ్వు కూడా మొదలెట్టావన్నమాట" ఆయాసపడుతూ ఆగారు పార్వతమ్మగారు.

ఇక తిరిగి తిరిగి విసురు తన మీదకు రావడంతో నెమ్మదిగా జారుకున్నాడు విశ్వం. అది చూసి గాఢంగా నిట్టూర్చారు పార్వతమ్మ గారు.

ఇంతట్లో బైట చల్లగాలికి షికారుకి వెళ్ళి వచ్చిన సత్యమూర్తి గారు పెరట్లోకి వెళ్ళి కాళ్ళు కడుగుకుని వంటింట్లోకి వచ్చి పీట వాల్చుకుకూర్చుని "కాస్త కాఫీ ఇవ్వోయ్ పార్వతీ" అని"అవునూ విశ్వం ఏమిటీ ఆఫీసు నుంచి వచ్చి మళ్ళీ వెళ్తున్నాడు, ఎక్కడికీ" అడిగారు.

బియ్యం చేట పక్కన బెట్టి "అమ్మాయ్ సుజాతా! ఈ బియ్యం కాస్త ఎసట్లో పొయ్యమ్మా. ఎసరు మరిగి పోతోంది" అని కోడలికి చెప్పి కాఫీ కలిపి భర్త చేతికిస్తూ "ఆ ఏముందీ ఇప్పుడే అలా వెళ్ళొస్తానని వెళ్ళాడు కానీ-డాక్టరు గారు మొన్న టెస్టులు చేయించిన వాటి తాలూకు రిపోర్ట్సు ఇచ్చారుట ఇవాళ. 'లంగ్ కాన్సర్ వచ్చే

# మీ/వారి మాటలకు అర్థాలే వేరులే




■

జడ్జి:- (ముద్దాయితో) ఇంత డబ్బు నీ దగ్గరికెలా వచ్చింది. ఎక్కడ కొల్లగొట్టావు...

ముద్దాయి:- సత్య ప్రమాణం చేసి చెప్తున్నా యువరానర్. అది నా స్వంత డబ్బు... కొల్లగొట్టిందికాదు యువరానర్.

జడ్జి: అదే... నీ దగ్గరంత డబ్బు ఎలాగొచ్చింది.

ముద్దాయి:- మా ఇంట్లో స్వయంగా అచ్చుకొట్టినవి యువరానర్...

జడ్జి:-......!!!

— జి.వెంకటేశ్వరరావ్, ■
హైదరాబాద్

■ ''పక్కింటి అన్నయ్య పేకాటలో చాలా తగలేస్తారుట'' అని మీ శ్రీమతిగారు చెబితే 'ఇకనైనా బుద్ధి తెచ్చుకొని పేకాట బంద్ చేయండి' అని అర్థం!

'ఇంట్లో ఏమీ తోచక చస్తున్నాను' అని శ్రీమతి గారు అంటే 'వారానికి ఒక్కసారి అయినా సినిమాకో, షికారుకో తీసుకెళ్ళండి' అని అర్థం.

—ఎస్. పవన్‌కుమార్, వేములవాడ

■ ''ఈ ఇల్లు వాతావరణం బాగుండలేదు. ఈ ఇల్లు మారదాం'' అని మీ ఆవిడ మీతో అన్నదనుకోండి, దానర్థం, నిజంగా ఇల్లు, పరిసర వాతావరణం బాగుండలేదని కాదు. మీ పక్కింటాయనో... మీ ఎదురింటాయనో మీ ఆవిడకు సైటు కొడుతున్నారన్నమాట! లేదా... ఏడిపిస్తున్నారని అర్థం చేసుకోవాలి!

—సి. శ్రీనివాసమూర్తి, బెంగుళూరు రోడ్, హిందూపురం

■ ''ఏమండి ఈ రోజు బాగా చలివేస్తోంది'' అని మీ శ్రీమతి మీతో అంటే దాని అర్థం- రగ్గు కొనమని కాదు! ఆఫీసు నుంచి తొందరగా రమ్మని.

—దూసరి నాగయ్య, కర్నూలు-2

● *(ఈ శీర్షికకు మీరు మీ రచనలు పంపండి. మీ శ్రీమతి గారు ఒకటి చెప్పడానికి నర్మగర్భంగా మరొకటి చెప్పిన విషయాన్ని, మీ శ్రీవారుఒకటి చెప్పడానికి మరొకటి చెప్పిన వైనాన్ని మీరు రాయగలిగిన విధంగా రాసి పంపండి.)*

లక్షణాలున్నాయి, సిగరెట్లు పూర్తిగా మానెయ్యాలి మీ నాన్నగారు' అని అన్నారుట. నాకు భయంగా వుందండీ. అయినా ఆరోగ్యం ముఖ్యమా ఆ వెధవ సిగరెట్లు ముఖ్యమా చెప్పండి'' బాధగా! అన్నారు పార్వతమ్మగారు.

ఒక నిమిషం మాటలు రానట్టు మౌనంగా వున్నారు సత్యమూర్తిగారు. ఆ తరువాత నెమ్మదిగా ''నాకూ మానాలని వుంది పార్వతీ. కానీ ఆ అలవాటు ఈనాటిదిదా చెప్పు? పాతికేళ్ళ నాటిది. నెమ్మదిగా మానాలి. మానటానికి ప్రయత్నిస్తాను. ఒక్కసారిగా మానాలంటే కష్టమే'' ఖాళీకప్పు కిందపెట్టి తన గదిలోకి వెళ్ళి పడక్కుర్చీలో వాలారు సత్యమూర్తిగారు.

* * *


ఆ రోజు బంద్. షాపులు, ఆఫీసులు, స్కూల్సు అన్నీ మూసేశారు. రోడ్లు నిర్మానుష్యంగా వున్నాయి. రోజూ వచ్చే పోయే బస్సులతో రకరకాల మనుష్యులతో కళకళలాడే రోడ్లు ఆ రోజు వెల వెల బోతున్నాయి. సత్యమూర్తిగారికి ఇంట్లో ఏమీ తోచడం లేదు. ప్రక్క ఇంటి విశ్వనాథంగారితో పేకాట గాని, చెస్‌గాని ఆడదామంటే ఆయన కొడుకు దగ్గరికి ఏలూరు వెళ్ళి అప్పటికి వారం అవుతోంది. ప్రొద్దున్నించీ చదివిన పేపరే చదివి బోర్ కొడుతూంది. పైగా అప్పటికి సిగరెట్లు మానేసి రెండు రోజులవుతోంది. నాలుక రుచి చచ్చినట్లుగా వుంది. 'పోనీ ఒక్క సిగరెట్టు తాగితే... మనస్సు పీకింది. 'అమ్మో! పార్వతికి తెలిస్తే బాధపడుతుంది!' మనస్సుకి సర్ది చెప్పారు సత్యమూర్తిగారు. కాని మనస్సు ఊరుకోలేదు. ఒక్కటి తాగితే ఏమవుతుంది. ఒక్క సిగరెట్టు తాగి ఇంక పూర్తిగా మానెయ్యాలి!' అలా అనుకున్నాక ఇంక స్థిమితంగా కూర్చోలేక పోయారు కుర్చీలో.

''ఇదిగో పార్వతీ తలుపేసుకో ఇప్పుడే అలా వెళ్ళొస్తాను'' అని లోపలికి కేకేసి చెప్పు లేసుకుని బయల్దేరారు సత్యమూర్తిగారు.

బంద్ కావడం మూలాన ఒక్క కిళ్ళీ కొట్టు కూడా తెరవలేదు. ''పోనీ కొంత దూరం నడుద్దాం. ఎవడో ఒకడు తెరవకుండా వుంటాడా. దూరంగా అయితే ఎవరికీ తెలిసే అవకాశం లేదు'' అనుకుని ఎండని కూడా లెక్క చెయ్యక ముందుకి నడిచారు సత్యమూర్తిగారు.

'అమ్మయ్య... అక్కడేదో కొట్టు సగం తెరచి నట్టుంది. ఎవరూ లేదు అనుకొని గబాగబాఅడుగులేసి కిళ్ళీ కొట్టుని సమీపించి ''ఏమోయ్. ఓ గోల్డ్ ఫ్లేక్‌సిగరెట్ ఇవ్వోయ్'' అని డబ్బు లిచ్చి పక్కకు తిరిగిన సత్యమూర్తిగారు షాక్ కొట్టినట్టు నిలబడి పోయారు, కొట్టువాడు అందిస్తున్న సిగరెట్టు కూడా అందుకోకుండా.

అప్పట దాకా కొద్ది దూరంలో అటువైపు తిరిగి సిగరెట్ కాలుస్తూ పేపరు చూస్తూ ఇటు తిరిగిన విశ్వం పరిస్థితి కూడా అలాగే వుంది. తను సిగరెట్లు కాలుస్తున్నాడన్న విషయం ఇంకా తెలియని తండ్రి ఇప్పుడు కాలుస్తుండగా చూసి ఏమను కుంటాడోఅన్న భయం ఒక పక్క, డాక్టరుగారి మాటలు పెడ చెవిన పెట్టి తిరిగి సిగరెట్ కొంటున్న తండ్రిని చూసి బాధ ఒక పక్క విశ్వాన్ని నిశ్చేష్టునిగా చేశాయి. ✹



**కాపీ**

''పోస్టుమాన్‌గారూ, చిన్న సాయం చేయరూ. నా గర్ల్ ఫ్రెండ్‌కు ప్రేమలేఖ రాయడం చేతనవటం లేదు. ఏ అమ్మాయికైనా వచ్చిన ప్రేమలేఖ ఒక సారిస్తే, కాపీ చేసుకుని తిరిగి యిచ్చేస్తాను, ప్లీజ్..''

— గొల్లపూడి శైలజ